క్లుప్తంగా

పీసీసీ సభ్యుల ఎన్నిక

నెహ్రూనగర్: ఏఈఎల్‌సీ నార్త్ ప్యారిస్ చర్చి పీసీసీ(ప్యారిస్ చర్చ్ కమిటీ) సభ్యుల ఎన్నిక ఆదివారం జరిగిందని బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎస్‌జే బాబూరావు తెలిపారు. 14 మంది సభ్యులతో నూతన పీసీసీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. సభ్యులుగా జాలాది చిత్తరంజన్, బోరుగడ్డ రత్నాకర్, మేళం రమేష్‌కుమార్, పెండెం రతన్, పేర్లీ సందీప్, వి.పుల్లారావు, రాజేష్, సునీల్, మరియదాసు, సతీష్, ప్రేమ్‌కుమార్, సుధాకర్, దేవదానం, బాబులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: వయోవృద్ధులు, దివ్యాంగులను ఆదరించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 12 రకాల నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది వృద్ధులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అందరూ ఉండి కూడా ఒంటరి జీవితాలు జీవిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి ప్రతి ఒక్కరూ ఇతోధికంగా సహాయం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్‌వీ రమణ, పలకలూరి శివరావు, ఎస్‌వీ.రామకృష్ణారావు, పోలేపల్లి వెంకటసుబ్రమణ్యం, మామిడి శ్రావణి, పల్లంపాటి రజనీశ్వరరావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీగీత అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని, హాస్పిటల్స్ నిండా జ్వర బాధితులేన్నారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం సంస్థ సభ్యులు శ్రీ గీతను ఘనంగా సత్కరించారు.

మతసామరస్యానికి ప్రతీక గ్యార్మీ



పట్నంబజారు: మతసామరస్యానికి ప్రతీక గ్యార్మీ అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గం లోని 17వ డివిజన్ ఎల్ఆర్ కాలనీలో ఆదివారం హజరత్ మెహబూబ్ సుభాని గ్యార్మీ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇండియన్ ఆర్ట్స్, క్రాఫ్ట్ షాపింగ్ ఫెస్టివల్



నగరంపాలెం: స్థానిక నాజ్‌సెంటర్ గుంటగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ షాపింగ్ ఫెస్టివల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. వచ్చేనెల రెండో తేదీ వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు జూనెడ్ ఇక్బాల్, అశ్రఫ్అలీ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. దాదాపు 50 వేలకు పైగా రకాలు ఒక చోటే ఉన్నాయని అన్నారు. జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

పట్నంబజారు: కోటి సంతకాలతో కూటమి కోటల బీటలు వారడం ఖాయమని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెల్లుబిక్కుతున్న ప్రజాగ్రహ జ్వాలల్లో దగ్ధమవటం తథ్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ జగన్ తన హయాంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకుని వస్తే.. వాటిని చంద్రబాబు అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా ఇటు పేద విద్యార్థులు వైద్య విద్యకు, అటు పేద ప్రజలు వైద్యానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ అనర్థం జరగకుండా ఉండేందుకే వైఎస్ జగన్ కార్యచరణ రూపొందించి పోరుబాట పట్టారని, సంతకాల కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కో ఆర్డినేటర్ విఠల్, విద్యార్థి సంఘం నేతలు బాజి, రవి, జగదీష్, రాజేష్, అజయ్, కరీం, కిరణ్, సాదిక్, వినేష్, అరుణ్, హోసన్న, ప్రభు, యష్, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్య ద్వారానే జీవన స్థితిగతుల్లో మార్పు

పట్నంబజారు: విద్య ద్వారానే ఎవరి జీవన స్థితిగతుల్లో సమూల మార్పు వస్తుందన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి సూచించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం విద్యార్థులకు స్వర్ణయుగమని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అందరికీ ఉన్నత విద్యను ఉచితంగా అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని చెప్పారు. తర్వాత ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కో ఆర్డినేటర్ విఠల్, విద్యార్థి నేతలు బాజి, రవి, జగదీష్, రాజేష్, అజయ్, కరీం, కిరణ్, సాదిక్, వినేష్, అరుణ్, హోసన్న, ప్రభు, యష్, సాయి, రామకష్ణ పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు ఎడ్యుకేషన్: సమాచార హక్కు చట్టంపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రభుత్వ అధికారులు తమ బాధ్యతలు తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా ఫోరం ఫర్ ఆర్‌టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈమని హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం లాడ్జి సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజలతో కలసి అరండల్‌పేటల పోలీస్ స్టేషన్ వరకు నడిచారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టటం కష్టతరమైన నేపథ్యంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని హక్కుగా పొందే అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2005 అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టాన్ని తెచ్చిందన్నారు. ముందుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ జేసీకి భారత రాజ్యాంగ ప్రతిని బహూకరించారు. డాక్టర్ మూకిరి సుధ పాడిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్

పట్నంబజారు: ఈ నెల 20వ తేదీన దీపావళిని పురస్కరించుకుని, బాణసంచా విక్రయించే వ్యాపారులు పూర్తి స్థాయిలో అన్ని అనుమతులు తీసుకోవటంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్ కోరారు. లాలాపేటలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. లైసెన్సులు, సరైన అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. షాపులు, గౌడౌన్‌లు ప్రజలు నివశించే ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు పాటించాలని, మైనర్లను పనిలో పెట్టుకోకూడదని, అధికారులు సూచించిన సమయాల్లోనే విక్రయాలు చేపట్టాలని సూచించారు. దీపావళి రోజు సాయంత్రం 5 గంటల తరువాత అమ్మకాలు పూర్తి నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వలు ఉంచితే.. వాటిని సీజ్ చేయటంతో పాటు చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ నిల్వలు కలిగి ఉన్న వారి సమాచారాన్ని డయల్ 112, 8688831568 కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

బాణసంచా నిల్వ చేస్తే చట్టపరమైన చర్యలు

నగరంపాలెం: దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో అనుమతుల్లేకుండా, విరుద్ధంగా బాణాసంచా నిల్వలు ఉంచితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బాణాసంచా విక్రయ, నిల్వ కేంద్రాలపై పోలీస్ శాఖ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వ అనుమతులతో బాణాసంచా దుకాణాలు, నిల్వ కేంద్రాలు నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక బకెట్లు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉండాలని దుకాణదారులను ఆదేశించారు. దుకాణాలు, నిల్వ కేంద్రాల వద్ద ధూమపానం, మంటలు, విద్యుత్ షార్ట్‌కు కారణమయ్యే వస్తువులను నిషేధించాలని అన్నారు. విక్రయ కేంద్రాలను జనసంచారానికి దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. మైనర్లు, పిల్లలను విక్రయాల్లో నియమించడం నిషిద్ధమని అన్నారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే 101 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని చెప్పారు. విక్రేతలు అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి, భద్రతా పత్రాలు తీసుకోవాలని అన్నారు.

19న బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ద్వితీయ మహాసభ

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఈనెల 19న బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ గుంటూరులో నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్ తెలియజేశారు. ఈ మేరకు అరండల్‌పేటలో ఆదివారం ఫెడరేషన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులలో బీసీ ఉద్యోగులకు మెరిట్ కం–రోస్టర్ విధానం అమలు చేయాలని, ఇతర పలు డిమాండ్లతో ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆత్మనిర్భర్ భారత్ సంకల్పమే దేశాభివృద్ధికి పునాది

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి



మాట్లాడుతున్న కుమార్‌స్వామి

గుంటూరు మెడికల్: ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం కేవలం ఒక నినాదం కాదని, ప్రతి భారతీయుని జీవిత ధ్యేయంగా మారాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి అన్నారు. ఆదివారం గుంటూరు లాల్‌పురం రోడ్డు లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ''ఆత్మనిర్భర్ భారత్ జిల్లా స్థాయి కార్యశాల''లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన రైతు స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహిస్తేనే భారతం నిజమైన ఆత్మనిర్భర్ భారత్ అవుతుందన్నారు. విదేశీ ఉత్పత్తులపై ఆధార పడకుండా, మన భారతీయ సాంకేతికత, మన విత్తనాలు, మన యంత్రాలు, మన శ్రమ – ఇవే మన బలమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రాజు, బిట్రా శివన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జూపూడి రంగరాజు, రాష్ట్ర ఐటీ కన్వీనర్ మకుటం శివ, పొగాకు బోర్డు చైర్మన్ సి.హెచ్.యశ్వంత్, బీజేపీ సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, జిల్లా కన్వీనర్ కిష్టపాటి నారాయణరెడ్డి, కో కన్వీనర్లు మునగపాటి నాగేశ్వరరావు, పాట్లు మూర్తి శ్రీనివాస్, శ్రీమతి కొచ్చర్ల శ్రీదుర్గా, సీనియర్ నాయకులు ఈదర శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాస్, వై.వి. సుబ్బారావు, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక సమస్యల్ని నిర్లక్ష్యం చేయవద్దు



మాట్లాడుతున్న డాక్టర్ తేజస్విని

గుంటూరు మెడికల్: వయసుతో నిమిత్తం లేకుండా మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని మానసిక వైద్య నిపుణులు కె.ఎల్.తేజస్విని పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ కేఎల్ తేజస్విని మాట్లాడుతూ యువతలో ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు పెరిగిపోతున్నాయని చెప్పారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అత్యవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే విధంగా పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ వయస్సు, ఎత్తును బట్టి శరీర బరువును కలిగి ఉండడం, ఆహార నియమాలు, శారీరక వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో అత్యధిక శాతం మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గాజుల లక్ష్మీనారాయణ, డాక్టర్ టి.చంద్రశేఖర్ రెడ్డి, తూబాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తోన్న వాగ్గేయకార సంగీత, నృత్య ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో జరగ్గా, చిగురుపాటి కమల జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. స్థానిక కళాకారులు వాగ్గేయకార కీర్తనల గానం చేశారు. బీవీఎస్.ప్రణతి, వైష్ణవి తోడి ఆడిటల వర్ణంతో ప్రారంభించి అన్నమయ్య కీర్తనలను, డి.లలిత, రాజ్యలక్ష్మీ భైరవి ఆది తాళ వర్ణం ఉత్తుక్కాడు వెంకట సుబ్బయ్యర్ ఎన్.సి. కృష్ణమాచార్య కృతులను అలపించారు. సాయంత్రం కార్యక్రమాలను రేడియాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ సుజాత, డాక్టర్ జె.నరేష్‌బాబు, విశ్రాంత అధ్యాపకులు ఎస్.తిరుపతయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం సంగీత రత్నమణి పద్మశ్రీ శ్రీనివాసన్ (చెన్నై) శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో సన్మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషురాని, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, లలిత దేవి, మీనాక్షి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, విజయలక్ష్మి పాల్గొనగా, అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు.

శ్రేష్ట విద్య పురస్కారం అందుకున్న జార్జిబాబు



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అప్సా డెమోక్రటిక్ ఆధ్వర్యంలో శనివారం ఎన్జీవో కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూనగర్‌లోని ఒలీవా స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.జార్జిబాబు రాష్ట్రస్థాయిలో శ్రేష్టవిద్య పురస్కారం అందుకున్నారు. అదే విధంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎబీజ్ విభాకర్ జిల్లాస్థాయి అవార్డుతో సత్కారాన్ని పొందారు. నాణ్యమైన విద్యావిధానం, అంకితభావంతో పని చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో అవార్డు అందుకున్నట్లు జార్జ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు జీఎస్టీపై సదస్సు

నెహ్రూనగర్: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ''జీఎస్టీ 2.0 సంస్కరణలు– భవిష్యత్ ఆర్థిక ధోరణులు'' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపారవేత్తలతో మధ్యాహ్నం 3 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెమినార్ ఉంటుందని చెప్పానరు.

రేపు ఏసీ కాలేజీలో

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ''బిల్డింగ్ డెవలపర్స్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్'' అంశంపై క్రెడాయి, నరేడ్కో, బీఏఐ సభ్యులు, బిల్డర్లు, డెవలపర్లు, కాంట్రాక్టర్లు, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సప్లయర్లు (సిమెంట్, పెయింట్స్, ఇంటీరియర్, ఎక్స్టీరియర్), హార్డ్‌వేర్ షాపులు, ఇతర సంబంధిత వ్యక్తులకు ఎగ్జిబిషన్, అవగాహన కార్యక్రమం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఏసీ కాలేజీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని జీఎస్టీ అనుగుణ ఇన్వాయ్సింగ్ విధానం, ధర పారదర్శకతను ప్రతిబింబించే విధంగా ఆయా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. స్టాల్స్ కోసం నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ రాంబాబు (98499 08390)ని సంప్రదించవచ్చని సూచించారు.

104 ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు లక్ష్మణరావు

లక్ష్మీపురం: 104 మొబైల్ మెడికల్ యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బకాయిలు తక్షణమే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆదివారం పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశం కు జిల్లా అధ్యక్షులు గోరంట్ల సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 నిర్వహణకు సర్వీస్ ప్రొవైడర్‌గా ఉన్నటువంటి అరబిందో సంస్థ ప్రతి ఒక్క ఉద్యోగికి ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్లు చేయకపోవడం సరైనది కాదన్నారు. కొత్త సంస్థ అయిన భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఇప్పటికీ ఏ ఉద్యోగికి పేస్లిప్ ఇవ్వలేదన్నారు. ఎందుకు వేతనాలలో కోత విధిస్తున్నారు అర్థం కావటం లేదని ఎప్పటికైనా ప్రతి ఉద్యోగికి పేస్లిప్ ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు జరగాలని అన్నారు. ప్రతి ఉద్యోగికి పది లక్షలు బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల సురేష్ కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలయ్యేటువంటి సీవు లీవులు, ఎర్న్ లీవులు, పబ్లిక్ హాలిడేలు, గుర్తింపు కార్డులు, పెరిగిన ధరల కనుగొనంగా వేతనాల పెంపు చేయాలని, ప్రతి స్లాబ్ లో ఉన్న ఉద్యోగికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలూరి శ్రీహర్ష, ఐ నాగులు, బాలకష్ణ, సత్యరాజు, విజయ్ కుమార్, సురేష్, సాయిరాం, సుబ్బారావు, అమర్చంద్, సూర్యనారాయణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

రాత్రుళ్లు బైక్‌లపై అనవసరంగా తిరిగితే కేసు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లా వ్యాప్తంగా ఎవరైనా రాత్రుళ్లు అనవసరంగా సంచరిస్తే ప్రత్యేక డ్రైవ్‌లతో కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

రాత్రుళ్లు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, రోడ్లపై సంచరిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిని అదుపులోకి తీసుకున్నారు. 106 మందిపై 104 కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ తోపాటు, రాత్రివేళల్లో జరగనున్న చట్ట వ్యతిరేక చర్యలను నిరోధించడం ఈ డ్రైవ్ ఉద్దేశమని అన్నారు. మద్యం మత్తులో రాత్రులు సంచరించడం వల్ల నేరాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ విధులను బలోపేతం చేస్తామని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో సంచరించే అనుమానితులను గుర్తించి విచారిస్తామని చెప్పారు. స్థానికంగా ఉండే ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీసులకు, డయల్ 112 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు తెలిపారు.

హాస్యంతో కూడిన కేర్యాంప్



మాట్లాడుతున్న నటుడు కిరణ్ అబ్బవరం

నగరంపాలెం: ఈనెల 18న విడుదల చేయనున్న కెర్యాంప్ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూడాలని నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. కెర్యాంప్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ దీపావళి పండుగకు వస్తున్నామని, కుటుంబ సమేతంగా వెళ్తే కడుపుబ్బ నవ్వుతారని అన్నారు. మొదటి నుంచి చివరి వరకు హాస్యంతో కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికే ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని అన్నారు. ఇదే రీతిలో సినిమాను కుటుంబ సభ్యులతో వీక్షించాలని చెప్పారు. ఇప్పటి వరకు విడుదలైన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులు, అభిమానులకు ధన్యవాదాల అని అన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే అభిమానం చూపాలని అన్నారు.

నకిలీ ఆర్డర్ ఇచ్చినా చర్యలు శూన్యం!

- కార్పొరేషన్‌లో ఉద్యోగం పేరుతో రూ.6 లక్షలు వసూలు
- ఈ వ్యవహారంలో కమిషనర్ చాంబర్‌లో పనిచేసే ఓ ఉద్యోగి హస్తం
- ఓ ఉన్నతాధికారి వద్ద సెటిల్‌మెంట్ చేసినట్లు ఆరోపణలు
- మరో నలుగురికి కూడా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన వైనం



నెహ్రూనగర్: కమిషనర్ సంతకంతో నకిలీ ఆర్డర్ సృష్టించి ఉద్యోగం పేరుతో మోసానికి పాల్పడిన చర్యలు కనిపించడం లేదు. కార్పొరేషన్ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇప్పిస్తానని సంస్థ ఉద్యోగి రూ.6 లక్షలు వరకు వసూలు చేసి ఉద్యోగం ఇవ్వకపోవడంపై నగరానికి చెందిన ఓ వ్యక్తి నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై 'సాక్షి'లో ఈ నెల 9వ తేదీన ప్రచురితమైంది. నకిలీ ఆర్డర్ వ్యవహారంలో సదరు ఉద్యోగితో పాటు కమిషనర్ చాంబర్‌లో పనిచేసే ఓ ఉద్యోగి హస్తం ఉన్నట్లు కార్యాలయం మొత్తం గుప్పుమంటుంది. వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ ఇప్పిస్తామని చెప్పి రూ.6 లక్షలు దాకా వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడ ఈ విషయంపై దూమారం రేగి సదరు ఉద్యోగుల మెడకు చుట్టుకుంటుందో అని ఓ ఉన్నతాధికారి వద్ద సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు సమాచారం.

మరో నలుగురు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం..

కార్పొరేషన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని సదరు ఉద్యోగులే మరో నలుగురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. వారు కూడా మేము మోసపోయామని కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

విచారణ చేపట్టాం

నకిలీ ఆర్డర్ విషయంపై కమిషనర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టాం. వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి నివేదికను కమిషనర్‌కు అందజేస్తాం.

– సీహెచ్ శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్ 2

నకిలీ ఆర్డర్ తయారు చేసి కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసినా చర్యలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

వివిధ కారణాలతో ఆగిపోయిన వారి నుంచి రూ.లక్షలు వసూలు

ఆప్కాస్(అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్) ఐడీ ఉండి. వివిధ కారణాలతో గత ఐదు నెలలకు పైగా విధులకు హాజరు కాని వారు సుమారు 40 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. 5 నెలలకు పైగా విధులకు హాజరు కాని వారిని తొలగించాలని ఆప్కాస్ నిబంధనలు ఉన్నప్పటికీ.. విధులకు గైర్హజరైన వారందరిని పిలిపించి మీకు తిరిగి ఉద్యోగాలిస్తామని దీనికి రూ.2 లక్షలు దాకా ఖర్చు అవుతుందని చెప్పడంతో వారంతా సదరు డబ్బులు చూసుకుని విధుల్లో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం.